# ఎంగిలాకులు

పురిజాల సుధాకర్



అ దొక చెత్తకుండీ. దాని ప్రక్కనే నగరం యొక్క మురికి నీటి కాలువ. దానికి ముందు కొద్ది దూరంలో ఒక చిన్న భోజన హోటల్. ఆ హోటల్ కి చెందిన కుర్రాడు రెండు మూడు నిమిషాలకోసారి, ఆ హోటల్ కి సంబంధించిన ఎంగిలాకులు తెచ్చి, ఆ కుండీలో వేస్తున్నాడు.

ఆ ఎంగిలాకుల కోసం అక్కడ మూడు కుక్కలు ఎంతసేపటి నుంచో వున్నాయి. ఆ ఆకుల కోసమే అన్నట్టు ఎదురు చూస్తూ ఆ కుండీ దగ్గరకి వెళ్ళలేక మానలేక నానా అవస్థలు పడుతూన్న కాకులు.

కానీ......

అక్కడ........

ఓ పన్నెండేళ్ళ పచ్చ చొక్కా కుర్రాడు కర్ర పట్టుకొని నిల్చున్నాడు. ఆ కుక్కలకీ కాకులకీ ఎంగిలాకులు దక్కనీయకుండా కాపలా కాస్తున్నాడు. ఆ కుర్రాడి మొహం తిండికి వాచి పోయి వుంది. కళ్ళు లోతుగా వున్నాయి. గుడ్డలు మాసి వున్నాయి. జుత్తు చిందర వందరగా అసహ్యంగా వుంది. బక్కగా వున్న వాడిని చూసి ఆ కుక్కలు భయపడలేదేమోకానీ, వాడి చేతిలో పొడుగ్గా వున్న కర్రని చూసి భయపడుతున్నాయి.

అంతలో....

ఇంకో కుర్రాడు గబగబా వచ్చాడు. వాడి దగ్గర చిన్న సైజ్ అట్టడొక్కు వుంది. వాడు, వీడి కంటే కాస్త పొడుగ్గా వున్నాడు.

అంతే..... గలాటా ప్రారంభం అయింది.

వాడు చెత్తకుండీలో వున్న ఆకులన్నీ ఒడిసి పట్టి అట్టడొక్కులో వేసాడు. ఆ వెంటనే పచ్చచొక్కా కుర్రాడు ఆ డొక్కులొక్కుని ఆకుల్ని కుండీలో పడేసి గట్టిగా తిట్టాడు.

వాడు వీడిపై తిరగబడ్డాడు.

అసలే చిరిగున్నగుడ్డలు మరీ చింపేసుకున్నారు. జుట్టు పీక్కున్నారు. రోడ్ మీద దెబ్బలాడుకుంటూ దొర్లారు.

వాళ్ళని ఎవరూ పట్టించుకోలేదు.

ఇదే అదును అని, అంతవరకు ఎంతో



ఆశగా ఎదురుచూస్తున్న కుక్కలు కాకులు చెత్తకుండీ మీద పడ్డాయి.

కొన్ని నిమిషాల దెబ్బలాట తర్వాత.... మొదటనించీ ఎంతో జాగ్రత్తగా కాపలా వున్న పచ్చచొక్కా కుర్రాడు నీరసంగా పడిపోయాడు.

వాడిని ఓడించిన కుర్రాడు ఆ కాకుల్నీ కుక్కల్నీ అదిలించి ఎంగిలాకులన్నీ ఊడ్చేసి...., ఆ పదార్థాలన్నీ అట్టడొక్కులో వేసి విజయగర్వంతో వెళ్ళిపోయాడు.

రచయిత రవీంద్ర ఆ దృశ్యాన్ని చాలా పరీక్షగా చూసాడు. అతనిలో రచయిత మేల్కొన్నాడు.

రీతిక శీర్షిక యువతకై ప్రత్యేకించిన శీర్షిక. యువకవులు, కథకులు అనేకమంది తమ కథలను, కవితలను 'ఆహ్వానం' పత్రికకు పంపుతున్నారు. వీరిని ప్రోత్సాహించేందుకై రీతిక శీర్షికలో క్రొత్త కవులకు, కథకులకు కొన్ని పేజీలు కేటాయిస్తున్నాం. ఈ అవకాశాన్ని వినియోగించుకోదలచిన యువతరం తమ కథలను, కవితలను సామాజిక అవగాహన కొరవడకుండా సంక్షిప్తంగా రాసి పంపితే ప్రచురిస్తాం. —ఎడిటర్

* * *

రవీంద్ర కథ తృప్తిగా చదివాడు.

ఆ దృశ్యం ఎందరికంటో పడినా తన కంట పడడం వల్ల వాళ్ళ బ్రతుకులని, నిస్సహాయతనీ, నికృష్టపు పరిస్థితులనీ అనుకున్న విధంగా కళ్ళకు కట్టినట్లుగా చిత్రించగలిగాడు.

అతనికో ఆలోచన వచ్చింది.

అంతే.....

ఆ కథని ప్రముఖ వారపత్రిక నిర్వహిస్తున్న కథల పోటీకి పంపాడు.

* * *

ఆ రోజు బద్ధకంగా కళ్ళు తెరిచేసరికి..... టేబిల్‌పై ఎర్రటి కాగితం ఫేన్ గాలికి రెపరెపలాడుతోంది.

ఆత్రుతగా చదివాడు.

ఉయ్ ఆర్ హ పీ టు ఇన్ ఫార్మ్ యుదట్ యువర్‌స్టోరీ "మురికిబ్రతుకులు" హేజ్ గాట్ ఫస్ట్ ప్రైజ్ ఆఫ్ అవర్ స్టోరీస్ కాంపిటీషన్ - దీపావళి - కంగ్రాచ్యులేషన్స్ ఆన్ యువర్ సక్సెస్ - ఎడిటర్.

అతని ఆనందానికి అవధులు లేవు.

* * *

ఆ రోజు సాయంత్రం నాలుగు ఘంటలు.

హోటల్ ఉడ్‌లాండ్స్‌లో పెద్ద హోలు.

సభావేదిక అలంకరించారు పెద్దలు.

'మా తెలుగు తల్లికి మల్లెపూదండ' పాటతో కార్యక్రమం ప్రారంభం అయింది.

అధ్యక్షుల వారు కార్యక్రమం కొనసాగించసాగారు.

ముఖ్య అతిధి ప్రసంగం అయింది.

రవీంద్ర వ్యక్తిత్వం..... రచనలు.... సామాజిక స్పృహ వాస్తవికతల మీద ముఖ్యులంతా మాట్లాడారు.

తర్వాత

రవీంద్ర మధురంగా కృతజ్ఞతలు చెప్పాడు.

రచయితగా ఉన్నత శిఖరాలను అందుకున్నందుకు తార్కాణంగా ఆ సభ ముగిసింది.

అందరూ సంతోషంగా వెళ్ళిపోయారు.

* * *

సంధ్యాసమయం -

కారు స్టార్ట్ చేసాడు రవీంద్ర.

కారు జోరుగా డ్రైవ్ చేసుకుంటూ ఇంటిదారి పట్టాడు.

కారు మలుపు తిరుగుతున్నపుడు.

"అమ్మా -" ఒక ఆర్తనాదం.

సడన్ బ్రేక్ వేసాడు.

కారు కింద పడిన అబ్బాయికి కాళ్ళు చెక్కుకుపోయాయి.

నీరసంగా వున్న మొహం మీద దెబ్బలు బాగా తగిలాయి.

స్పృహ కోల్పోయాడు.

ఆ కుర్రాడు తొడుక్కున్న పచ్చచొక్కా మరింత చిరిగింది.

ఆ కుర్రాడి పక్కనే పడున్న ఎంగిలాకులు.

ఆ బుట్ట దూరంగా విసిరి వేయబడ్డాది.

జనం పల్చగా పోగయ్యారు.

కారుదిగాడు రవీంద్ర

ఆ కుర్రాడి మొహం పరీక్షగా చూశాడు.

అంతే 'స్టన్' అయాడు.

అయినా -

కారులో ఆ కుర్రాడిని హోస్పిటల్‌కి తీసుకెళ్ళడానికి ప్రిస్టేజ్ అడ్డు వచ్చింది.

ఆ కుర్రాడి తల్లి దీనంగా రోదిస్తోంది.

ఆ ఎంగిలాకులు తినే వాళ్లని సమర్థిస్తూ జనంలో ఎవ్వరూ మాట్లాడడం లేదు.

జేబులో చెయ్యి పెట్టాడు రవీంద్ర.

డబ్బు లేదు. పత్రిక వాళ్ళిచ్చిన రెండు వేల అయిదు వందలు సభకోసం అయిపోయింది.

జనం ఒక్కొక్కరే వెళ్ళిపోసాగారు.

రవీంద్ర ఆ తల్లిని కనీసం ఓదార్చలేదు.

కర్తవ్యం గుర్తొచ్చింది.

కారు స్టార్ట్ చేసాడు.

కారు జోరుగా వెళ్ళిపోయింది.

ఆ కారు జోరుకి 'ఎంగిలాకులు' ఎగిరిపోయాయి. ○

